క్లుప్తంగా

17 నుంచి ఎన్టీఆర్ శత జయంతి సంబరాలు

పాత గుంటూరు: ఈ నెల 17 నుంచి 23 వ తేదీ వరకు ఎన్టీఆర్ నాటక సప్తాహం పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కాట్రగడ్డ రామకృష్ణ ప్రసాద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని అన్నమయ్య కళావేదికపై ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 17న కూచిపూడి నృత్య ప్రదర్శన, లెక్క తప్పింది హాస్య నాటిక, 18న ప్రభంజనం నాటిక, 19న శ్రీ మాధవ వర్మ పద్యనాటకం, 20న హాస్య వల్లరి, స్వర్ణకమలాలు నాటిక, 21న ఎర్ర కలువ నాటిక, 22న థ్యాంక్స్ ఫర్ ది సియం నాటిక, 23న పక్కింటి మొగుడు హాస్యనాటిక, మనసున మనసై నాటికలు ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు.

విశ్రాంత హోంగార్డుకి ఆర్థిక సాయం



నగరంపాలెం: పదవి విరమణ పొందిన హోంగార్డుకి సహచర హోంగార్డులు ఒక రోజు వేతనాన్ని అందించడాన్ని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ అభినందించారు. గతేడాది అక్టోబర్ 9న డి.హనుమంతరావు పదవి విరమణ చేశారు. ఈ మేరకు జిల్లాలోని హోంగార్డుల అందరూ కలసి ఒక రోజు వేతనం రూ.2.33 లక్షల చెక్కుని హనుమంతరావుకి శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్ అందించారు. కుటుంబ సభ్యులతో ఆనందంగా ఉంటూ శేష జీవితాన్ని హాయిగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.సుప్రజ(పరిపాలన), ఆర్ఐ రమేష్‌కృష్ణన్ పాల్గొన్నారు.

8న అవోపా స్వర్ణోత్సవ వేడుకలు



పాత గుంటూరు: ఆర్యవైశ్య అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) స్వర్ణోత్సవ వేడుకలు ఈ నెల 8న నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం తెలిపారు. శుక్రవారం అరండల్‌పేటలోని అవోపా కార్యాలయంలో కార్యక్రమం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్రహ్మం మాట్లాడుతూ మంగళదాస్ నగర్‌లోని ఏఎస్. కన్వెన్షన్ సెంటర్‌లో వేంకటేశ్వర గానామృత కల్యాణంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు స్వర్ణోత్సవ వేడుక సభ, వయో వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్ల పంపిణీ, వస్త్రాలను అందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అవోపా ప్రధాన కార్యదర్శి వెచ్చా రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి సూర్యనారాయణ, చైర్మన్ అన్నా నంద కిషోర్, వి.కృష్ణానంద్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన పోస్టర్ ఆవిష్కరణ



గుంటూరు మెడికల్: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన అవగాహన పోస్టర్‌ను శనివారం తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్‌ముస్తఫా మంగళదాస్ నగర్‌లో ఆవిష్కరించారు. ఈసందర్భంగా సీజనల్ వ్యాధులు సోకకుండా వైద్య ఆరోగ్య శాఖ చేస్తున్న కార్యక్రమాల గురించి డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుమయఖాన్ వివరించారు. ప్రజలు తప్పనిసరిగా ఫ్రైడే డ్రైడేగా పాటించాలని, మురుగునీరు నిల్వలేకుండా పరిసరప్రాంతాలు శుభ్రం చేసుకోవాలని, దోమకాటు బారిన పడకుండా దోమతెరలు వాడాలన్నారు. ముందస్తు చర్యలతో అవగాహన కార్యక్రమాలతో దోమ కాటు ద్వారా సోకే డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌లాంటి వ్యాధులను నివారించవచ్చు అన్నారు.

కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టుకు ప్రథమ బహుమతి

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో బీఏ (కమ్యూనికేటివ్ ఇంగ్లిష్) కోర్సు తృతీయ సంవత్సర విద్యార్థిని టి.పూజిత రూపొందించిన కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టుకు రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి తెలిపారు. ప్రొఫెసర్ కె. పద్మజ పర్యవేక్షణలో కమ్యూనిటీ ఎడ్యుకేషన్ అండ్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ అనే అంశంపై విద్యార్థిని సమర్పించిన ప్రాజెక్టుకుగాను గురువారం విజయవాడలో కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ నుంచి రూ.10వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందుకున్నట్లు వివరించారు. ఈసందర్భంగా శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పూజితను అభినందించారు.

ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్
- 19వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం



స్థానికులకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

నగరంపాలెం: దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో సామాజిక మహా విప్లవానికి నాంది పలికినట్లు ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ అన్నారు. 19వ డివిజన్ 63వ సచివాలయ పరిధిలోని నల్లచెరువు 11వ వీధిలో రెండో రోజైన శుక్రవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. డివిజన్ ఇన్‌చార్జి టెంట్ హౌస్‌బాబు అధ్యక్షత వహించారు. గడప గడపకు వెళ్లి స్థానికులతో మాట్లాడి, ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగారు. అనంతరం స్థానికులకు బుక్‌లెట్‌లను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ అత్యంత పారదర్శకంగా, అవినీతి, వివక్షకు అవకాశం లేకుండా అభివృద్ధి, సంక్షేమ పథకాలను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో విప్లవాత్మక చర్యలతో ఆయా వర్గాల ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధికి బాటలు వేసిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని చెప్పారు. ప్రభుత్వం లబ్ధిదారులకు అందించిన పథకాలను తెలియజేసేలా 'మూడో ఏట సంక్షేమ బావుటా' అనే బుక్‌లెట్‌లను అందిస్తున్నట్లు తెలిపారు. బుక్‌లెట్‌లపై లబ్ధిదారుల పేర్లు ఉంటాయని అన్నారు. మూడేళ్లల్లో ఏయే పథకాలలో లబ్ధి పొందారనే వివరాలు ఉంటాయని పేర్కొన్నారు. అదే సమయంలో మూడేళ్లల్లో ఏం చేశామనేది స్పష్టంగా ప్రచురించి, ప్రజలకు తెలియజేసే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. రానున్న రోజుల్లోనూ పేద ప్రజల సంక్షేమ కోసం మరెన్నో కార్యక్రమాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రతిపక్షాల అబద్ధపు హామీలను పట్టించుకోవద్దని అన్నారు. గత ప్రభుత్వంలో ఒక్క హామీ అమలు చేయలేదని, ప్రస్తుతం చంద్రబాబు రకరకాల స్టంట్‌లు వేస్తున్నారని వాటిని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని అన్నారు. ఇటీవల గుంటూరులో జరిగిన తొక్కిసలాటలో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను ఇంత వరకు పరామర్శించలేదని విమర్శించారు. ప్రభుత్వమే మృతుల కుటుంబాలకు నష్ట పరిహారం అందించినట్లు ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో ఉప మేయర్ షేక్ సజీల, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ పల్లపు మహేష్, రాష్ట్ర బత్రాజు కార్పొరేషన్ డైరెక్టర్ రామరాజు, నాయకులు యద్దనపల్లి బాలరాజు, కామిశెట్టి మధు, సోమికమల్, ప్రేమకుమార్, మల్లవరపు బుజ్జి, నాగూర్, అంజనాదేవి, సుభాని, ఫాతిమున్, ఆచారి పాల్గొన్నారు.

పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లపై చర్యలు

కమిషనర్ కీర్తి చేకూరి



ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో టెండర్ పొందిన అభివృద్ధి పనులు వేగంగా జరగాలని, టెండర్ పొంది పనులు ప్రారంభించని కాంట్రాక్టర్ల పై చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో అభివృద్ధి పనులు, నాడు-నేడు పనులు, హౌసింగ్, తాగునీటి సరఫరా తదితర అంశాలపై నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, హౌసింగ్, విద్యుత్ శాఖ అధికారులతో, ఎమినిటి కార్యదర్శులతో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అనేక అభివృద్ధి పనులకు నగరపాలక సంస్థ నుంచి అనుమతులు మంజూరు చేస్తున్నామని, అటువంటి పనుల్లో రాజీ పడకుండా వేగంగా, నాణ్యతా ప్రమాణాలకు తగ్గకుండా పనులు జరగాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే గడప గడపకు మన ప్రభుత్వం(జీజీఎంపీ)లో భాగంగా ప్రజా ప్రతినిధులు ఆయా ప్రాంతాల్లో గుర్తించిన పనులకు కూడా వెంటనే టెండర్స్ పిలిచి పనుల్లో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. పనులను ఈ.ఈ.లు నేరుగా పర్యవేక్షణ చేయాలన్నారు. పూర్తయిన పనులకు ఎప్పటికప్పుడు బిల్స్ అప్ లోడ్ చేయాలన్నారు. ఇంకా నిర్మాణ దశలో ఉన్న వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను త్వరగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని చెప్పారు. 15 ఫైనాన్స్ కమిషన్ నిధులతో చేపట్టిన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయడంతో పాటు కోర్టు కేసుల్లో నిర్దేశిత గడువులోగా కౌంటర్స్, అఫిడవిట్స్ వేయాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా నగరంలోని అన్ని ప్రజా మరుగుదొడ్లకు మరమ్మతులు చేయాలని, సులభ్ ఆధ్వర్యంలోని వాటిని కూడా శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని నోటీసులు ఇవ్వాలన్నారు. నగరంలో గాంధీ పార్క్ పనులు ఈ నెలాఖరుకి పూర్తి చేయాలని, అలాగే ప్రధాన జంక్షన్లను, ట్రాఫిక్ ఐలాండ్స్ ను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఏ.డి.హెచ్.ని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ విభాగ అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా ఎఫ్.ఆర్.ఎస్.ద్వారానే హాజరు నమోదు చేయాలన్నారు. హౌసింగ్ అంశాన్ని సమీక్షించి, లే అవుట్స్‌లో ఇళ్ల నిర్మాణాలకు తగిన విధంగా బోర్స్ వేయడానికి చర్యలు తీసుకోవాలని పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. లే అవుట్స్ వారిగా ఇప్పటి వరకు జరిగిన ఇళ్ల నిర్మాణాన్ని అధికారుల నుండి అడిగి తెలుసుకొని, ఇళ్ల నిర్మాణ పనులు కాంట్రాక్టర్లు వేగంగా చేయాలని, లబ్ధిదారుల నుండి ఎంఓయు, బ్యాంక్ అకౌంట్ల వివరాలను ఎమినిటి కార్యదర్శులు సేకరించాలన్నారు. శ్యామల నగర్ ఆర్.యు.బి.కి డి.పి.ఆర్.ను త్వరగా సిద్ధం చేయాలని, నగరంలోని ఆర్-బి రోడ్ల మరమ్మతులను పూర్తి చేయాలని సదరు అధికారులను ఆదేశించారు. అడవి తక్కెళ్లపాడులోని టిడ్కో గృహ సముదాయాలలో నిర్మించిన సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌కు, నగరంలోని రిజర్వాయర్లకు ప్రత్యేక లైన్ ద్వారా విద్యుత్ అందించడానికి ప్రతిపాదనలు ఇవ్వాలని సీపీడీసీఎల్ ఈ.ఈ.ని ఆదేశించారు. అలాగే నందివెలుగు రోడ్, పెద్ద పలకలూరు రోడ్లలో డ్రైన్ నిర్మాణం అయిన ప్రాంతాల్లో వెంటనే విద్యుత్ స్తంభాలు షిఫ్ట్ చేయాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ పెద్దిరోజ, డెప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ భాస్కర్, సి.ఎం.ఓ.హెచ్. డాక్టర్ విజయలక్ష్మి, ఎం.హెచ్.ఓ. డాక్టర్ భాను ప్రకాష్, ఈ.ఈ.లు సుందరరామిరెడ్డి, శాంతి రాజు, కొండారెడ్డి, కోటేశ్వరరావు, ఏపిసిపిడిసిఎల్ ఈ.ఈ. శ్రీనివాసబాబు, హౌసింగ్ ఈ.ఈ. శంకరరావు, ఏ.డి.హెచ్. రామారావు పాల్గొన్నారు.

మోకీలు సమస్యలకు ఉచిత పరీక్షలు



డాక్టర్ మద్ది వినోద్ కుమార్

గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలి వలన చిన్న వయస్సులోనే అనేక మంది మోకీలు సమస్యలతో బాధపడుతున్నారని ప్రముఖ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, అమృత హాస్పిటల్స్ అధినేత డాక్టర్ మద్ది వినోద్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక కొత్తపేట ఓల్డ్‌క్లబ్ రోడ్డులోని హాస్పిటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మోకీళ్ల సమస్యను ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా ఆపరేషన్లు నివారించవచ్చు అన్నారు. కోవిడ్ అనంతరం మోకీళ్ల సమస్యల బాధితుల సంఖ్య పెరిగిపోయిందని వెల్లడించారు. పలువురు బాధితులు సకాలంలో వైద్యులను సంప్రదించకుండా సమస్య బాగా ముదిరిన తరువాత సంప్రదించడం వల్ల వచ్చే ఎక్కువ ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అత్యాధునిక వైద్య సేవలను, ఆధునిక మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలను తమ ఆసుపత్రిలో అత్యంత రాయితీతో అందిస్తున్నామన్నారు. మోకీళ్ల సమస్యలతో బాధపడుతున్నవారు ఈనెల 16 వరకు తమ ఆసుపత్రిలో జరిగే ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకోవాలన్నారు.

9న 'కౌండిన్య' ఉపకార వేతనాల పంపిణీ



మాట్లాడుతున్న ఈవీ నారాయణ

గుంటూరు ఎడ్యుకేషన్: కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఉపకార వేతన ప్రదానోత్సవం పాటు కౌండిన్య ఐఏఎస్ అకాడమీ ప్రారంభోత్సవాన్ని ఈనెల 9వ తేదీ నిర్వహించనున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈవీ నారాయణ తెలిపారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గౌడ జన సేవా సమితి వ్యవస్థాపక బృందం ఆధ్వర్యంలో పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామ సమీపంలోని కౌండిన్య పురంలో దాతల సహకారంతో నిర్మించిన కౌండిన్య ఐఏఎస్ అకాడమీ భవనాన్ని రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 450 మంది విద్యార్థులకు రూ.18 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. 2006లో కేవలం ముగ్గురు విద్యార్థులకు రూ.10వేలతో ప్రారంభించిన ఉపకార వేతన పంపిణీ కార్యక్రమం ఇప్పటి వరకు ఆరువేల మంది విద్యార్థులకు రూ.1.50 కోట్లు మేరకు అందజేసినట్లు వివరించారు.

మెడికల్ ఎంప్లాయీస్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, తదితరులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ఆవరణలోని ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో యూనియన్ క్యాలెండర్‌ను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి ఆవిష్కరించారు. ఈసందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వడ్డె బాలయ్య నాలుగో తరగతి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఖాళీ పోస్టులను త్వరితగతిన భర్తీ చేయాలని, పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ తులశమ్మ, యూనియన్ నాయకులు హనుమంతరావు, సాంబనాయక్, వెంకటేశ్వరరావు, కుమార్‌రాజా, రవిశంకర్, నాగరాజు, కృష్ణ, కోటేశ్వరరావు, కమలకుమారి, సాంబి, జోత్స్న, జయమ్మ, మంగమ్మ పాల్గొన్నారు.

గుమస్తాలు న్యాయవాదులుగా ఎదగడం అభినందనీయం



సంక్షేమ సంఘ రిజిస్ట్రార్ బాడీ బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుంటూరు లీగల్: న్యాయవాదుల గుమస్తాలు న్యాయ విద్యనభ్యసించి న్యాయవాదులుగా ఎదగడం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం గుంటూరు బార్ అసోసియేషన్ హాల్లో వీరికి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గుంటూరు నగర న్యాయవాది గుమాస్తాల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని టౌన్ ప్రెసిడెంట్ అంబటి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. సభలో గుంటూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పాలడుగు వెంకటేశ్వరరావు, బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, సోమసాని బ్రహ్మానందరెడ్డి, ఏపీ గుమాస్తాల సంక్షేమ సంఘ అధ్యక్షుడు గొంటు కోటిరెడ్డి ప్రసంగించారు. గుండు వెంకట సుబ్రహ్మణ్య కుమార్ సభకు అధ్యక్షత వహించారు. అనంతరం రాష్ట్ర గుమాస్తాల సంక్షేమ సంఘ రిజిస్ట్రార్ బాడీ బోర్డును ఆవిష్కరించారు.

సంక్షిప్త వార్తలు

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గౌతమినగర్ 3వలైనులో నివసించే పల్లపు వెంగళమనోహర్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఆర్థిక సమస్యలతో అప్పులు చేశాడు. గురువారం మనోహర్ ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎటో వెళ్లిపోయాడు. ఆచూకీ కోసం వెతికినప్పటికి ఫలితం లేకపోవడంతో కనిపించకుండాపోయినట్లు నిర్ధారించుకుని భార్య భవాని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నాయకుల అరెస్టు

గుంటూరు ఈస్ట్: అరండల్‌పేట పోలీసు స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేసిన టీడీపీ నాయకులను పోలీసులు శుక్రవారం ముందస్తుగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కుప్పం ఘటనకు మద్దతుగా టీడీపీ నాయకులు కె.హనుమంతరావు, ఎస్.శ్రీనివాసరావు, మరో పది మంది శుక్రవారం అరండల్‌పేట పోలీసు స్టేషన్ ముందు నిరసన తెలిపారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు రాష్ట్ర స్థాయి కర్రసాము పోటీలు

గుంటూరు వెస్ట్(క్రీడలు): రాష్ట్ర స్థాయి సిలంబమ్(కర్రసాము) చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం నిర్వహించనున్నట్లు రాష్ట్ర కార్యదర్శి క్రిష్టఫర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిలంబమ్ స్టిక్ ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆధార్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలన్నారు. వివరాలకు 92471 11266 సంప్రదించాలని కోరారు.

నేడు ఎంప్లాయీస్ గ్రీవెన్స్

గుంటూరు వెస్ట్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం శనివారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు డీఆర్వో చంద్రశేఖరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బ్లేడుతో దాడి చేసిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: వ్యక్తిపై బ్లేడుతో దాడిచేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. హనుమయ్యనగర్‌లో నివసించే నాగేంద్రబాబు ఇంటికి శుక్రవారం శ్యామ్ అనే వ్యక్తి వచ్చాడు. పాతకక్షల నేపథ్యంలో ఇద్దరు గొడవపడ్డారు. శ్యామ్ బ్లేడ్‌తో నాగేంద్రబాబుపై దాడిచేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మార్పు బాలకృష్ణమ్మ సేవలు చిరస్మరణీయం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సంక్షేమానికి పాటుపడిన మార్పు బాలకృష్ణమ్మ సేవలు చిరస్మరణీయమని ఏపీటీఎఫ్(1938) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందు వేళాంగిణిరాజు, మేకల సుబ్బారావు పేర్కొన్నారు. నగరంపాలెంలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం సంఘ వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్సీ మార్పు బాలకృష్ణమ్మ సంస్మరణ సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి సంఘ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టిబోయిన నరసింహారావు, రాష్ట్ర క్రమశిక్షణ చైర్మన్ విజయానంద్, ఉపాధ్యాయ ప్రగతి సంపాదకుడు ఏవీ రామారావు, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎంవీ ప్రసాద్, నాయకులు ఎం.దేవదానబాబు, పి.రమేష్, మోపిదేవి శివశంకరరావు, సాయి నాగ మల్లేశ్వరరావు, జోజప్ప, గణేష్, నాగ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాస నిపుణుడు స్వామి వివేకానంద

గుంటూరు ఎడ్యుకేషన్: భారతదేశ గొప్పతనాన్ని విశ్వవేదికగా ప్రపంచదేశాలకు చాటి చెప్పిన స్వామి వివేకానందుడు ఒక మేనేజ్‌మెంట్ గురువుగా, ఆధునిక సమాజపు వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా నిలిచారని ప్రభుత్వ సమగ్ర వైద్యశాల కమ్యూనిటీ విభాగ వైద్య నిపుణుడు అనిల్‌కుమార్ పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో జాతీయ యువజనోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం డిగ్రీ కళాశాలల విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, ఎంబీఏ విభాగాధిపతి వి.చక్రవర్తి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డి.కల్యాణి, అధ్యాపకులు సీహెచ్ వైష్ణవి, సీహెచ్ వేదవతి, షబానా పర్వీన్, బాజీబాబు. ఎన్.అశోక్‌బాబు, పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామికి విశేష పూజలు

గుంటూరు ఎడ్యుకేషన్: శివముక్కోటిని పురస్కరించుకుని శుక్రవారం మల్లికార్జునపేటలోని శ్రీగంగా భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జునస్వామి వారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకంతో పాటు అన్నాభిషేకాన్ని నిర్వహించారు.

స్విమ్మింగ్‌లో భాష్యం విద్యార్థులకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ, హరిబాబు

గుంటూరు ఎడ్యుకేషన్: దేహ దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని భాష్యం విద్యాసంస్థల విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. చంద్రమౌళినగర్‌లోని భాష్యం ప్రధాన క్యాంపస్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 3,4వ తేదీల్లో తిరుపతిలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-19 బాల, బాలికల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ 2022-23లో భాష్యం మెడెక్స్ విద్యార్థులు నాలుగు స్వర్ణ పతకాలతో పాటు ఒక రజత, ఒక కాంస్య పతకాలను సాధించినట్లు చెప్పారు. భాష్యం మెడెక్స్‌లో జూనియర్ ఇంటర్ బైపీసీ చదువుతున్న శొంటి భవ్య 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లీతో పాటు 200 మీటర్ల బటర్ ఫ్లై విభాగాల్లో రెండు స్వర్ణ పతకాలను సాధించిందని తెలిపారు. అదే విధంగా శొంటి భావిక 400 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో ఒకటి, 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో ఒకటి చొప్పున రెండు స్వర్ణ పతకాలు సాధించినట్లు తెలిపారు. మరో సీనియర్ విద్యార్థి శొంటి రత్నసాయి 800 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో ఒక రజత, ఒక కాంస్య పతకాన్ని సాధించి, భాష్యం పేరు, ప్రఖ్యాతులను ఇనుమడింపచేశారని పేర్కొన్నారు. భాష్యం మెడెక్స్‌లో బైపీసీ చదువుతున్న విద్యార్థులు స్విమ్మింగ్‌లో స్వర్ణ పతకాలను సాధించడం గర్వకారణమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా విద్యార్థులను రామకృష్ణతో పాటు ప్రిన్సిపాల్ హరిబాబు అభినందించారు.

లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వ్యవస్థ ప్రారంభం



వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్న పార్థసారథి, రత్నకుమార్, జయరత్నం, మధుబాబు, జ్యోతి

గుంటూరు లీగల్: నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్రవేశ పెట్టిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వ్యవస్థను శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌లో స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ ప్రవీణ్ కుమార్ రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా నుంచి న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వై.వి.ఎస్.బి.జి పార్థసారథి, కార్యదర్శి కె.రత్నకుమార్, గుంటూరు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా ఎంపికైన పుసులూరి జయరత్నం, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా ఎంపికైన ఇళ్ల మధుబాబు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా నెలవల్లి జ్యోతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వై.వి.ఎస్.బి.జి పార్థసారథి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని కోర్టుల్లో ఉన్న ఫ్రీ లీగల్ ఎయిడ్ కేసులను గుంటూరు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు ఇక నుంచి వాదిస్తారని తెలిపారు. ఇప్పటి వరకు ఫ్రీ లీగల్ ఎయిడ్ కేసులను వాదిస్తున్న ప్యానెల్ న్యాయవాదులు అన్ని కేసుల రికార్డులను లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులకు అందజేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధానానికి ఎంపికైన న్యాయవాదులకు న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, కార్యదర్శి, సిబ్బంది, గుంటూరు బార్ అసోసియేషన్‌కు చెందిన పలువురు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలియజేశారు.

జాతీయ అడ్వెంచర్ శిక్షణ శిబిరంలో పాల్గొన్న ఏసీ కళాశాల విద్యార్థి



విద్యార్థి సాయికృష్ణను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మోజెస్

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్ర క్రైస్తవ కళాశాల విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా వివిధ రంగాల్లో రాణిస్తున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఏసీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గతేడాది నవంబర్ 6వ తేదీ నుంచి 15 వరకు మనాలీలోని అటల్ బిహారీ వాజ్‌పేయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటినీరింగ్ అండ్ అలైడ్ స్పోర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ అడ్వెంచర్ శిక్షణ శిబిరంలో ఏఎన్‌యూ తరఫున ఎంపికైన 10 మంది విద్యార్థుల బృందంలో ఒకరిగా తమ కళాశాల బీకాం విద్యార్థి పూజల సాయికృష్ణ పాల్గొన్నట్లు వివరించారు. అదే విధంగా జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో ప్రథమ బహుమతి పొందిన తమ విద్యార్థులు పి.సాయి కృష్ణ, బీవీ కోటేశ్వరరావు, అంజి నాయక్, షేక్ కరిష్మా కర్ణాటక రాష్ట్రంలోని హుబ్లీలో ఈనెల 12 నుంచి 16 వరకు జరగనున్న 26వ జాతీయ యువజనోత్సవాలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ మోస్ట్ రెవరెండ్ డాక్టర్ కేఎఫ్ పరదేశి బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ కొమ్మాలపాటి మోజస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జె.మార్కస్ ప్రదీప్, డాక్టర్ ఏజే భాగ్యలత అభినందించారు.

మహిళా పాలిటెక్నిక్‌కు ఓవరాల్ చాంపియన్‌షిప్



గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ వేదికగా జిల్లాలోని పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థినులకు రెండు రోజులపాటు నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా, ఆటల పోటీల్లో ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించింది. క్రీడా పోటీల్లో భాగంగా శుక్రవారం బీఆర్ స్టేడియంతో పాటు గుజ్జనగుండ్లలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో విద్యార్థినులకు వివిధ పోటీలను నిర్వహించారు. రన్నింగ్, షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్ పోటీల్లో వివిధ కళాశాలల విద్యార్థినులు ప్రతిభ చాటారు. అదే విధంగా రెండు రోజుల పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ విద్యార్థినులకు ట్రోఫీని బహూకరించారు. కార్యక్రమంలో గుంటూరులోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తిరుపతి- షిరిడికి ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ మీదుగా ప్రయాణికుల సౌకర్యార్థం తిరుపతి-షిరిడి మీదుగా ప్రత్యేక రైళ్లను కేటాయించినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం ఆంజనేయులు శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబర్ 07637 రైలు తిరుపతి-షిరిడి వయా గుంటూరు డివిజన్ మీదుగా ఈ నెల 22, 29 ఫిబ్రవరి 512,19,26వ తేదీలలో ప్రతి ఆదివారం ప్రత్యేక రైలును కేటాయించడం జరిగిందని చెప్పారు. రైలు నంబర్ 07638 షిరిడి- తిరుపతి వయా గుంటూరు డివిజన్ మీదుగా జనవరి 23,30, ఫిబ్రవరి 6,13,20,27వ తేదీలలో ప్రతి సోమవారం ప్రత్యేక రైలును కేటాయించడం జరిగిందని తెలిపారు.